క్లుప్తంగా

నారాయణపురంలో వైద్య శిబిరం



రోగులకు మందులు అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ కన్నారావు

మందస: ఉద్దాన ప్రాంతమైన నారాయణపురంలో మంగళవారం గాయత్రి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొర్ల కన్నారావు ఆధ్వర్యంలో శ్రీబైకాల పోలమ్మతల్లి సేవా సంఘం సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జెమ్స్ వైద్యులు డాక్టర్ మర్రి దయాకర్, డాక్టర్ స్వాతి 196 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 20 మందికి రిఫరల్ చేశారు. 20 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్ బత్తిని తేజేశ్వరరావు, గొరకల కేశవరావు, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి పి.వెంకటేష్, ఏరియా మేనేజర్ రాపాక తిరుపతిరావు, ట్రస్టు ప్రతినిధులు కొంచాడ సురేష్‌కుమార్, ఉగ్రిపల్లి మోహన్, జగదీష్‌పండా, ముడిమించి మధుబాబు, పులారి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడికి వీల్‌చైర్ వితరణ



లక్ష్మణరావుకు వీల్‌చైర్ అందిస్తున్న దృశ్యం

కవిటి: మండలంలోని బొరివంకకు చెందిన అసంఘటిత రంగ కార్మికుడు డి.లక్ష్మణరావు ప్రమాదవశాత్తు గాయపడి కొన్నేళ్లుగా మంచానికి పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న హెల్పింగ్‌హ్యాండ్స్, ఉద్దానం యూత్‌క్లబ్ ప్రతినిధులు కంచిలి మండలం తలతంపర సమీపంలోని గుల్ల సీతయ్య ఫౌండేషన్ వారికి లక్ష్మణరావు దీనస్థితిని వివరించారు. వారు వీల్‌చైర్‌ను వితరణగా అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు దుద్ది సతీష్, హెల్పింగ్ హ్యాండ్స్, యూవైసీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



చెక్ అందజేస్తున్న నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని నగరంపల్లి గ్రామానికి చెందిన శిష్టి రామ్మూర్తి బ్రెయిన్ స్ట్రోక్‌కి గురికావడంతో ఆయన కుటుంబానికి పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, సర్పంచ్ దువ్వాడ పద్మావతి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.45,000 చెక్ అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరుకు కృషి చేసిన మంత్రి సీదిరి అప్పలరాజుకు రామ్మూర్తి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రుణపడి ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శిష్టు నీలాచలం, మామిడి గోవిందరావు, బమ్మిడి అప్పలనాయుడు, శిష్టి రామయ్య, జానకిరామయ్య పాల్గొన్నారు.

చంద్రపతి కుటుంబానికి పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చిన్నారావు, కసవయ్య

కాశీబుగ్గ: బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్ల చంద్రపతి సేవలు మరువలేనివని, ఆయన మృతి తీరని లోటని జిల్లా గొర్రెలు, మేకల పెంపకదారుల సహకార సమాఖ్య అధ్యక్షుడు రాపాక చిన్నారావు అన్నారు. మంగళవారం శ్రీకాకుళంలో ఆయన స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు అఖిల భారతీయ యాదవ మహాసభ జిల్లా కార్యదర్శి కసవయ్య ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని అక్కుపల్లి శివసాగర్ బీచ్ పరిసర ప్రాంతంలో 304 ఏళ్ల క్రితం వెలసిన నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ, శివలింగ పునఃప్రతిష్ఠాపన, సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా మంగళవారం మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మద్దు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు తామాడ సరస్వతి, కార్యదర్శి చెల్లూరు కృష్ణారావు, సెక్రటరీ అర్జాల ఈశ్వరరావు, పాపారావు, పి.జోగారావు, గ్రామపెద్దలు, యువత పాల్గొన్నారు.

అచ్చెన్నా.. ఇది అభివృద్ధి కాదా?

- ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ నాగార్జున యాదవ్



కాశీబుగ్గ హైస్కూల్లో ఆర్‌ఓ ప్లాంట్ నీటిని తాగుతున్న ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ నాగార్జున యాదవ్

టెక్కలి/ఇచ్ఛాపురం/కాశీబుగ్గ: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ పాలనలో సుమారు రూ.20.89 కోట్ల రూపాయలతో పాఠశాలలు, జూనియర్ కళాశాలలను అభివృద్ధి జరిగాయని, ఈ అభివృద్ధి అచ్చెన్నకు కనిపించలేదా అని ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ యనమల నాగార్జున యాదవ్ ప్రశ్నించారు. మంగళవారం టెక్కలి, ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పనులను పరిశీలించి మాట్లాడారు. దివంగత మాజీ రాష్ట్రపతి వీ.వీ.గిరి విద్యనభ్యసించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొదటి విడత నాడు–నేడు పథకంలో సుమారు రూ.61.71 లక్షలతో అభివృద్ధి చేశామన్నారు. రెండో విడతగా రూ.కోటీ 17 లక్షలతో ఆధునీకరణ పనులు చేశామని వివరించారు. టెక్కలి నియోజకవర్గంలో మొదటి విడతగా 133 పాఠశాలల్లో సుమారు రూ.14914.62 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని, రెండో విడతగా 139 పాఠశాలల్లో రూ.5679.12 కోట్లతో నాడు నేడు కింద ఆధునీకరణ పనులు చేశామని పేర్కొన్నారు. వీటితో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సుమారు రూ.3 కోట్లతో అభివృద్ధి చేశామని తెలిపారు. అచ్చెన్నాయుడు సొంత గ్రామం నిమ్మాడలో మొదటి విడతగా రూ.64.42 లక్షలు, రెండో విడతగా రూ.107.96 కోట్లతో పాఠశాలలను అభివృద్ధి చేశామని వివరించారు. గత టీడీపీ హయాంలో ఏనాడైనా అచ్చెన్నాయుడు ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారా అని నాగార్జున యాదవ్ ప్రశ్నించారు. ఈయన తో పాటు ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ డీవీఎస్.మూర్తి, జేఈ కె.గణేష్, ప్రధానోపాధ్యాయుడు నాగభూషణ్, ఉపాధ్యాయుడు ఆర్.శ్రీనివాస్ ఉన్నారు. అనంతరం ఇచ్ఛాపురం ప్రభుత్వోన్నత పాఠశాల, మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో నాడు నేడు ద్వారా జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పలువురు టీచర్లు విన్నవించారు. కార్యక్రమంలో సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ బోర పుష్ప, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ ఉలాల భారతిదివ్య, నాడు–నేడు జేఈ సునీల్, వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్, మాజీ ఎంపీపీ కారింగి మోహన్‌రావు, పాఠశాల కమిటీ చైర్మన్ కె.భీష్మ, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాశీబుగ్గ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి సౌకర్యాలు పరిశీలించారు. హైస్కూల్ హెచ్‌ఎం చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురంలో ఉపాధ్యాయుల కొరత సమస్య వివరిస్తున్న సీడాప్ చైర్మన్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

పేద నాయీబ్రాహ్మణులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు

టెక్కలి: నిరుపేదలకు సాయం చేయాలనే ఆలోచన ప్రతిఒక్కరిలో ఉండాలని శ్రీకాకుళానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు దొంతికుర్తి త్రినాథరావు, నిర్మల దంపతులు అన్నారు. జిల్లాలోని 61 మంది నిరుపేద నాయీబ్రాహ్మణులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున మంగళవారం టెక్కలిలో ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ నాయీబ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన తాము ఉపాధ్యాయులుగా పనిచేసి ఉద్యోగవిరమణ చేశామని పేర్కొన్నారు. తమ సామాజిక వర్గంలో నిరుపేదలను ఆదుకోవాలనే ఆశయంతో ఏటా ఆర్థిక సాయం చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా టెక్కలి, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధులు దాతలను సన్మానించారు. కార్యక్రమంలో ఆచంట శ్రీనివాస్, కృష్ణప్రసాద్, టి.కర్రెన్న, కె.రామారావు, ఎస్.వెంకట్రావు, పాపారావు, ఐ.చిన్నారావు, శంకర్, రాంబాబు, ఐ.దర్మారావు, అప్పారావు, ఎ.చిన్నారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యానికి ప్రాధాన్యం

కంచిలి: అన్ని ఆవాస ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. కంచిలి-1, కంచిలి-2 సచివాలయాల పరిధిలో బలియాపుట్టుగ కాలనీ, మఠం కంచిలి ప్రాంతాల్లో 15వ ఆర్థిక సంఘం మండల పరిషత్ నిధులు రూ.17.5లక్షల వ్యయంతో 'గ్రామీణ తాగునీటి పథకం' బోరు, మోటారు, వాటర్ ట్యాంక్ సిస్టమ్ 7 యూనిట్లను మంజూరు చేశారు. వీటికి మంగళవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొత్తకోట శేఖర్, పట్టణ పార్టీ అధ్యక్షుడు సాహుకారి చిరంజీవులు, ఉపసర్పంచ్ బడియా నారాయణ, వార్డు మెంబర్లు రాపాక జోగారావు, జి.శ్యాం, జోగేశ్వర్ చౌదరి, పోలినాటి బుజ్జి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు తలగాన తిరుపతి, కొత్తకోట రవి, కొల్లి చందన్ కిషోర్ యాదవ్, గవలపు శ్యామ్, బదకల ధర్మారావు పాల్గొన్నారు.



బోరు ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

మొక్కలతోనే చల్లదనం

కాశీబుగ్గ : వేసవిలో భూతాపం తగ్గాలంటే నీడను ఇచ్చే మొక్కలు నాటాలని వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ అధ్యక్షురాలు, మాజీ కౌన్సిలర్ రోణంకి శాంతికుమారి అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పద్మనాభపురం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనేల గోపాల్, హెచ్‌ఎం లఖినాన ఢిల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు బత్తిని ఓంకారం, ఉపాధ్యాయులు ధనుంజయ, భానుమతి, ఇరిగేషన్ అధికారి పొట్నూరు శ్రీనివాసరావు, గ్రీన్‌ఆర్మీ సభ్యులు నూకల హేమసుందర్, రోణంకి వెంకటరమణ, అశోక్‌కుమార్, కార్యదర్శి బందాపు తిరుమల పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న దృశ్యం

సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌కు అభినందనలు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ చొక్కర రఘురాంకు మంగళవారం పలాస నియోజకవర్గ మత్స్యకార ఐక్యవేదిక ప్రతినిధులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జోగి గౌతమ్, ఐక్యవేదిక నాయకులు కొమర దేవరాజు, అంబటి ఆనందరావు, చొక్కర నరహరి, బట్టి రాజు, తిర్రి రాజారావు, బొంపల్లి సునీల్‌వర్మ, రాజారావు పాల్గొన్నారు.



డాక్టర్ రఘురాంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం

నందిగాం: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అన్నారు. మంగళవారం పెద్దబాణాపురంలో పర్యటించి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభ్యర్థుల విజయానికి సమష్టి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిన్ని జోగారావు, కణితి నారాయణమూర్తి, అంబోడి విష్ణు, పోలాకి మోహనరావు, రోణంకి ధర్మారావు, బొమ్మాళి గున్నయ్య, నారంనాయుడు, డిల్లేశ్వరరావు, కామరాజు పాల్గొన్నారు.



పెద్దబాణాపురంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీరామమూర్తి

వైభవంగా చింతామణి అమ్మవారి సంబరం



కవిటి: ఉద్దాన ప్రాంతప్రజల ఆరాధ్య దైవం చింతామణి అమ్మవారికి మంగళవారం వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు సంబరాలు నిర్వహించారు. మొక్కుబడులు తీర్చుకునే క్రమంలో అమ్మవారి ప్రతిరూపమైన గజముద్దను మేళతాళాలతో ఊరేగించారు.

టెన్త్ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ



ఉపకరణాలు అందిస్తున్న చక్రవర్తిరెడ్డి

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని లొద్దపుట్టి గ్రామానికి చెందిన యువజన సంఘ నేత సుగ్గు చక్రవర్తిరెడ్డి పదో తరగతి విద్యార్థుల పెన్నులు, అట్టలు తదితర ఉపకరణాలు పంపిణీ చేశారు. మంగళవారం లొద్దపుట్టి ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాల్లో ఉన్న పది విద్యార్థులకు ఈ ఉపకరణలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉషారాణి, కామరాజు, హేమంతరావు, సురేష్ పండా పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గంలో ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇల్లు, హుదుద్ ఇల్లు ఎన్నికల షెడ్యూల్ రాకముందే లబ్ధిదారులకు అందజేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణ యాదవ్ కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌కు వినతిపత్రం అందించినట్లు మంగళవారం పేర్కొన్నారు. కాశీబుగ్గ నుంచి చిన్నబడాం వైపు వెళ్లే ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని విన్నవించారు.

ధాన్యం బస్తాలు దగ్ధం



కాలిపోయిన ధాన్యం బస్తాలు

కోటబొమ్మాళి: మండలంలోని దంత గ్రామంలో రైతు వెలమల శ్రీనివాసరావుకు చెందిన 15 ధాన్యం బస్తాలు మంగళవారం దగ్ధమయ్యాయి. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం వల్లే ఈ ఘటన జరిగిందని బాధిత రైతు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని కోటబొమ్మాళి ఎస్‌ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు

మందస : మండలంలో మూడు జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 234 మంది పరీక్షలు రాయనుండగా చీఫ్ సూపరింటెండెంట్‌గా చింతాడ శరత్‌బాబు, డిపార్ట్‌మెంటల్ అధికారిగా పిరియా సుధాకరరావు నియమితులయ్యారు. పరీక్షల ఏర్పాట్లును ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపకుడు సాప నరేష్, జూనియర్ అసిస్టెంట్ కూర్మాపు వెంకటరావు, రమణరావు మంగళవారంపరిశీలించారు.

బొరివంక చిన్నారుల ఔదార్యం



బొరివంకలో విరాళాన్ని అందిస్తున్న చిన్నారులు

కవిటి: మండలంలోని బొరివంక ఆదర్శ ప్రాథమిక పాఠశాల చిన్నారులు తమ పాకెట్ మనీ రూ.2116 సేకరించి కంచిలి మండలం తలతంపర సమీపంలో గుల్ల సీతయ్యఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న అనాథ శరణాలయానికి మంగళవారం విరాళంగా అందించారు. వీరిని ఫౌండేషన్ ప్రతినిధులు అభినందించారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య



ఇద్దివానిపాలెంలో విద్యార్థులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

కవిటి : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని కవిటి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాజేశ్వరరావు అన్నారు. మంగళవారం కవిటి జూనియర్ కళాశాల సిబ్బంది కవిటి మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న టెన్త్ క్లాస్ విద్యార్థులను కలిసి కళాశాలలో అందుతున్న సౌకర్యాలను వివరించారు. ప్రైవేటు కాకుండా ప్రభుత్వ కాలేజీలోనే చేరాలని కోరారు. ఇద్దివానిపాలెం, డొంకూరు తదితర పాఠశాలలను సిబ్బంది గొండ్యాల విష్ణుమూర్తి, పోలాకి హరి, బొడ్డ శ్రీనుబాబు, కరుణశ్రీ, పాపారావు, అనసూయమ్మ, ఉగాదినాయుడు సందర్శించారు.

ఒడ్డుకు చేరిన భారీ సొరచేప



డొంకూరు తీరంలో సొర చేప

ఇచ్ఛాపురం రూరల్: మండలంలో డొంకూరు సముద్ర తీరానికి భారీ సొర చేప అలలతో కొట్టుకు రావడంతో స్థానికులు చేపను చూసేందుకు ఎగబడ్డారు. సోమవారం రాత్రి మత్స్యకారులు వేట నుంచి ఇంటికి వస్తున్న సమయంలో సొర చేప మృతి చెంది కనిపించడంతో గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం ఈ చేపను చూసేందుకు పరిసర గ్రామాల ప్రజలు, విద్యార్థులు తరలివచ్చారు. చేప తోకభాగం బోట్ ఫ్యాన్ రెక్కలకు తగిలి మృతి చెందినట్లు చెబుతున్నారు. 15.5 అడుగులు పొడవు, 7.8 అడుగులు వెడల్పు ఉన్న ఈ చేపను పులిముఖ చేపగా పిలుస్తుంటారని మత్స్యకారులు తెలిపారు.

మృతుని కుటుంబానికి సాయం



కుటుంబానికి చెక్ అందజేస్తున్న సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని 23 వార్డులో బెల్లుపడ కాలనీకి చెందిన కేశవసాహు కిడ్నీ ఇన్ఫెక్షన్‌కు గురయ్యాడు. అతని చికిత్స కోసం రెండునెలల కిందట సీఎం రిలీఫ్ ఫండ్‌కు కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకొన్నారు. ఇంతలో పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. అతనికి భార్య, ఏడాది వయసు గల బాబు ఉన్నారు. మృతుని కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.1,50,000 మంజూరు కావడంతో మంగళవారం సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి చేతులు మీదుగా చెక్ అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ జి.ప్రదీప్, వైద్యులు గోవింద్, పార్టీ నాయకులు, వార్డు పెద్దలు జి దిలీప్, గవరయ్య, శ్రీనివాససాహు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో అక్కవరం విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓలు

టెక్కలి రూరల్: గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో ఈ నెల 21 నుంచి 23 వరకు జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా బాలికల జట్టు విజేతగా నిలిచింది. ఆ జట్టులో టెక్కలి మండలం అక్కవరం ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కె.అమృత, కె.భవానీలను మంగళవారం టెక్కలి ఎంఈఓలు డి.తులసీరావు రెడ్డి, డి.చిన్నారావు అభినంధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.పద్మావతి, అనసూయ, వ్యాయామ ఉపాధ్యాయుడు నీలయ్య, గ్రామపెద్ద పి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

వలంటీర్లే ప్రగతి సారథులు



పాలవలసలో వలంటీర్లను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

సోంపేట: వలంటీర్లే ప్రగతి సారథులు అని పాలవలస సర్పంచ్ ఎం.హేమలత అన్నారు. పంచాయతీ కేంద్రంలో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ సేవలందించిన వలంటీర్లను సత్కరించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు డి.రూపవతి, నాయకులు కె.శ్రీనివాసరావు, ఎం.శంకరరావు, డి.ఢిల్లీరావు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా గ్రామ ముఖద్వారం



బాతుపురం గ్రామ ముఖద్వారం

వజ్రపుకొత్తూరు రూరల్: బాతుపురం గ్రామానికి చెందిన బత్తిని దమయంతి సహకారంతో సుమారు రూ.10 లక్షల వ్యయంతో గ్రామ ముఖద్వారాన్ని నిర్మించారు. భర్త బత్తిని దానేసు(అండమాన్) జ్ఞాపకార్థం నిర్మించిన ఈ ముఖద్వారాన్ని ఈ నెల 29న ప్రారంభించనున్నట్లు నిర్మాణదాత దమయంతి తెలిపారు. రూ.2.70 లక్షలతో పాలపోలమ్మ అమ్మవారి ముఖద్వారంతో పాటు మరికొన్ని అభివృద్ధి పనులు చేపట్టి గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తున్నందుకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

జగనన్న ఆరోగ్యసురక్షతో రక్షణ



రోగులకు సూచనలిస్తున్న వైద్యులు

వజ్రపుకొత్తూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందని గోవిందపురం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక అన్నారు. మంగళవారం దేవునల్తాడలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించి 373 మందికి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో వైద్యులు మౌనిక, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

కంచిలి: డోలగోవిందపురం సచివాలయ ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 శిబిరాన్ని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నీరజ, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, సర్పంచ్ హృషికేష్ పాత్రో, బైరిపురం నేత ఇండుగు సీతారాం, వైద్య లు, సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.